
मनोजवं मारुततुल्यवेगं जितेन्द्रियं बुद्धिमतां वरिष्ठम् ।
वातात्मजं वानरयुथमुख्यं श्रीरामदूतं शरणं प्रपद्ये ।।

# శ్రీ ఆంజనేయ దండకం

శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యకాయం ప్రకీర్తిప్రదాయం

భజే వాయుపుత్రం భజే వాలగాత్రం భజే2హం పవిత్రం భజే సూర్యమిత్రం

భజే రుద్రరూపం భజే బ్రహ్మతేజం బటంచున్ ప్రభాతంబు సాయంత్రము న్నీనామ

సంకీర్తనల్ జేసి నీ రూపు వర్ణించి నీమీద నే దండకం బొక్కటిం జేయనూహించి

నీ మూర్తినిం గాంచి నీ సుందరం బెంచి నీ దాసదాసుండనై రామభక్తుండనై

నిన్ను నే గొల్చెదన్ నీ కటాక్షంబునన్ జూచితే వేడుకల్ జేసితే

నా మొరాలించితే నన్ను రక్షించితే అంజనాదేవి గర్భోదయా

దేవ నిన్నెంచ నేనెంతవాడన్ దయాశాలివై జూచితే దాతవై బ్రోచితే దగ్గరం బిల్చితే

తొల్లి సుగ్రీవునకున్ మంత్రివై స్వామికార్యంబునందుండి

శ్రీరామునిం జూచి వారి న్విచారించి సర్వేశు బూజించి యబ్భానుజుం బంటు గావించి

యవ్వాలినిం జంపి కాకుత్థ్సతిలకుం దయాదృష్టి వీక్షించి కిష్కింధ కేతెంచి

శ్రీరామ–కార్యార్థమై లంక కేతెంచి లంకిణిన్ జంపియున్ లంకనుం గాల్చియున్

భూమిజం జూచి యానంద ముప్పొంగ యా యుంగరంబిచ్చి

యా రత్నమున్ దెచ్చి శ్రీరామునకు న్నిచ్చి సంతోషితుం జేసి

సుగ్రీవునిన్ అంగదున్ జాంబవంతాది నీలాదులం గూడి

యా సేతువున్ దాటి కీశౌఘ–సంఘంబుచే దైత్యులన్ ద్రుంచగా

రావణుండంత కాలాగ్నియుగ్రుడై పోరి బ్రహ్మండమైనట్టి యా శక్తియున్ వేసి

యా లక్ష్మణున్ మూర్చ నొందించగా నప్పుడే పోయి

సంజీవినిం దెచ్చి సౌమిత్రికి న్నిచ్చి ప్రాణంబు రక్షించగా

కుంభకర్ణాది వీరాళితో బోరి చెండాడి

శ్రీరామబాణాగ్ని వారందరిన్ రావణుం జంపగా

నంత లోకంబు లానందమై యుండ నవ్వేళలన్

నవ్విభీషణున్ వేడుకన్ దోడుకన్ వచ్చి పట్టాభిషేకంబు జేయించి

సీతామహాదేవినిన్ దెచ్చి శ్రీరామునకు న్నిచ్చి నయోధ్యకున్ వచ్చి

పట్టాభిషేకంబు సంరంభమై యున్న నీకన్న నాకెవ్వరున్ గూర్మి లేరంచు మన్నించినన్

రామభక్తి ప్రశస్తంబుగా నిన్ను సేవించి నీ నామ సంకీర్తనల్ జేసితే

పాపముల్ బాయునే భయముల్ దీరునే భాగ్యముల్ గల్గునే

Mulugu.com

సకల సామ్రాజ్యముల్ సకల సంపత్తులున్ గల్గునే
వానరాకార ! యో భక్తమందార ! యో పుణ్యసంచార !
యో ధీర ! యో శూర ! నీవే మహా ఫలమ్ముగా వెలసి
యా తారకబ్రహ్మ మంత్రంబు పఠియించుచున్ స్థిరముగా వజ్రదేహంబునున్ దాల్చి
శ్రీరామ శ్రీరామ శ్రీరామ యంచున్ మనః పూతమై
యెప్పుడున్ దప్పకన్ దాల్చు నా జిహ్వ యందుండి నీ దీర్ఘ దేహంబునన్ లోక సంచారివై
రామనామాంకిత ధ్యానివై బ్రహ్మవై బ్రహ్మతేజంబునన్ రౌద్ర విజ్వాల కల్లోల ! హావీర హనుమంత !
ఓంకార హ్రీంకార శబ్దంబులన్ భూతప్రేతపిశాచ శాకినీ ఢాకినీ
గాలి దయ్యంబులన్ నీదు వాలంబునం జుట్టి నేలం బడంగొట్టి
నీ ముష్టిఘాతంబులన్ బాహుదండంబులన్ రోమఖండంబులన్ ద్రుంచి
కాలాగ్ని రుద్రుండవై బ్రహ్మప్రభా భాసితంబైన నీ దివ్యతేజంబునున్ జూచి
రారా ! నృసింహా ! యటంచున్ దయాదృష్టి వీక్షించి నన్నేలు స్వామీ !
నమస్తే సదా బ్రహ్మచారీ ! నమస్తే వ్రతః పూర్ణకారీ ! నమస్తే వాయుపుత్రా ! నమస్తే నమస్తే నమస్తే
నమః .

Mulugu.com